



బలవంతపు కోర్కెకి పూర్తిగా సాయ పడింది.

వేణుమీద, భవిష్యత్తుమీద ఎన్నో ఆశలు పెట్టుకున్న లీల అరిచి గోలచేసే ప్రయత్నం చెయ్యలేకపోయింది. ఆమె మనసులో నాలుగో వంతు అతడి కోరిక తోనూ సహకరించింది. ఆ రాత్రి చాలా సేపటికి బలవంతంగా తెల్లవారింది.

* * *

"వేణూ! మన పెళ్లి సంగతి త్వరగా తేల్చుకోవటం మంచిది" అంది లీల మర్నాటి సాయంత్రం అతణ్ణి కలిసి నప్పుడు.

"పెళ్లి ...." వక్రంగా నవ్వాడు వేణు, "మారేజ్ ఈజ్ యెనేక్సిడెంట్. ప్రమాదాలు చెప్పి జరగవ్ కదా! అంచేత పెళ్లిళ్లూ అంతే! ఎప్పుడెవరికి ఎక్కడ రాసిపెట్టి వుందో దేవుడే రాసి పంపుతాట్టగా! చూద్దాం - మనిద్దరికే రాసుంటే అలాగే జరుగుతుందిగా! తొందరెందుకూ, లెటజ్ వెయిట్ అండ్ సీ!" ఆ మాటలనేసి, అతడు అక్కణ్ణించి వెళ్లిపోయాడు.

లీల నిశ్చేష్టురాలై కూచుండిపోయింది కాసేపు. ఆ తరవాత ఆమె నెమ్మదిగా తెలివైన ఆలోచనల్లోకి మళ్లింది.

(మరో మూడు నెలలదాకా తన కొచ్చిన భయం ఏదీ లేదు. ఈలోగా వేణు విషయం స్పష్టంగా తేలుతుంది. ఆనాడు తనకంటూ ప్రత్యేకమయిన భయమేదయినా మిగిల్తే .... అందుకి అధునాతన సమాజంలో ఎన్ని శాస్త్రీయ పరిష్కారాలు లేవూ! అనుకుంది లీల. ఆ నిర్ణయానికి వచ్చేశాకే ఆమెలో మిగిలివున్న భయమూ, బాధా పూర్తిగా తొలిగిపోయాయి!)